సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 19 । జూన్ । 2025



నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ట్రస్టుకు పసుపులేటి వెంకట శశిధర్, వెంకట సత్యలక్ష్మి దంపతులు (సికింద్రాబాద్) రూ.1,01,116 విరాళంగా అందించారు.



రూ.1.33 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నల్లం పరుశరామ్ (కాకినాడ) రూ.1,33,000 విరాళాన్ని బుధవారం అందజేశారు. వీరికి అన్నదానం బాండ్‌ను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

5,277 క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 5,277 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి డెల్టాకు 9,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 9.65 అడుగుల వద్ద నీటిమట్టం నెలకొంది.

న్యూస్‌రీల్

'దీవెన' బకాయిలు విడుదల చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నరసింహారావు తదితరులు

అమలాపురం రూరల్: ప్రైవేటు కళాశాల విద్యార్థులకు బకాయి పడిన వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలను చెల్లించి ఆదుకోవాలని జిల్లా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ నిశాంతిలకు వారు వినతి పత్రాలు అందజేశారు. 2023–24, 2024–25 విద్యా సంవత్సరాలకు సంబంధించి సంబంధించి మూడేసి టెర్మ్‌ల ఫీజులను ఇంతవరకు కళాశాలలకు జమ చేయలేదన్నారు. దీని వల్ల విద్యా సంస్థల మనుగడ కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల గుర్తింపు రెన్యువల్ విధానాన్ని ఐదేళ్లకు ఓసారి పెట్టాలని, సీట్ల భర్తీ విషయంలో మేనేజ్ మెంట్ కోటా తొలగించి కన్వీనర్ కోటాలో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ కళాశాల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కరాటం వీఆర్ఎస్ నరసింహారావు, ఉపాధ్యక్షుడు ఆకుల బాపన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌పై బదిలీ వేటు

కొవ్వూరు: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న టి నాగేంద్ర కుమార్‌ను బదిలీ చేస్తూ బుధవారం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఫిర్యాదు మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఈ బదిలీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. గతంలో కమిషనర్‌పై ఓ మహిళ విషయంలో పలు ఆరోపణలు వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు బాధితులు చేసిన ఫిర్యాదుతో చర్యలు తీసుకున్నట్టు తెలిసింది.

కూనవరమే శాపం!

- మొగ నుంచి ఎగదన్నుతున్న సముద్రపు నీటి పోటు
- డ్రెయిన్లలోకి ఉప్పునీరు
- పంట కాలువలు, చానళ్లకూ చేరిక
- ఇదే కొనసాగితే ఖరీఫ్‌కు ముప్పు
- ఏటా మూడు వేల నుంచి ఐదు వేల ఎకరాలు సాగుకు దూరం
- డ్రెడ్జింగ్ వల్ల నష్టమేనంటున్న రైతులు

సాక్షి, అమలాపురం: కోనసీమ తీర ప్రాంతంలోని వరి ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సాగుకు మరో అవాంతరం ఏర్పడింది. ఏటా ముంపునకు భయపడి ఇక్కడి రైతులు సాగు వదిలేస్తున్న విషయం తెలిసిందే. కాని ఈసారి మరింత మంది సాగుకు దూరమయ్యే పరిస్థితిని సాగు, మురుగునీటి పారుదల శాఖ అధికారులు కల్పిస్తున్నారు. కాలువపై మరమ్మతులు, నిర్మాణాల పేరుతో నీరు ఆలస్యంగా వదలడం ద్వారా సాగునీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు సాగుకు ఆటంకాలు సృష్టిచారు. సముద్ర నీరు డ్రైన్లలోకి పారేలా చేసి మురుగు నీటిపారుదల శాఖ అధికారులు రైతులకు తొలకరి సాగు అంటేనే భయపడేలా చేస్తున్నారు.

కోనసీమ జిల్లాలో కూనవరం, వాసాలతిప్ప, శంకరగుప్తం డ్రెయిన్ల నుంచి సముద్ర మొగ ద్వారా ముంపునీరు దిగాల్సి ఉంది. ఇదే ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. భారీ వర్షాల సమయంలో ఇవి మూసుకుపోవడం... తెరిస్తే ఉప్పునీరు పోటెత్తి చేలను, తోటలను ముంచెత్తడం పరిపాటిగా మారింది. కూనవరం మొగ సైతం ఇదే విధంగా రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. ముమ్మిడివరం, అమలాపురం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల పరిధిలో సుమారు 35 వేల ఎకరాల ఆయకట్టుకు చెందిన ముంపునీరు ఈ మొగ ద్వారా సముద్రంలోకి దిగాలి. ఇప్పుడు వరి ఆయకట్టు తగ్గినా ఇంకా 25 వేల ఎకరాల సాగవుతోంది. మొగ తరచూ మూసుకు పోతున్న విషయం తెలిసిందే. దానికి ఇరువైపులా ఉన్న ఉప్పలగుప్తం, చిర్రయానాం, అల్లిపర్రల ద్వారా ముంపునీరు దిగేందుకు అక్రమ ఆక్వా చెరువులు సాగు అడ్డంకిగా మారింది. వందల ఎకరాలు ఏటా ముంపుబారిన పడి రైతులు నష్టపోతున్నారు. దీనితో ఈ ప్రాంతంలో ఏటా ఖరీఫ్‌లో మూడు వేల ఎకరాల నుంచి ఐదు వేల ఎకరాల్లో వరిసాగు వదిలేస్తున్నారు.



కూనవరం మొగ ద్వారా డ్రైన్‌లోకి పోటెత్తుతున్న సముద్ర నీరు

ఇసుక తవ్వకాలతో తెరుచుకున్న మొగ

కూనవరం మొగ ద్వారా ముంపునీరు సముద్రంలోకి దిగేందుకంటూ మురుగునీటి పారుదల శాఖ అధికారులు ఇటీవల డ్రెడ్జింగ్ నిర్వహించారు. మొగ వద్ద 600 మీటర్లు వదిలి మురుగునీటి కాలువలో సుమారు 2.50 కిలో మీటర్ల మేర డ్రెడ్జింగ్ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఇదే నిజమైతే అర కిలోమీటరు మేర కన్నా ఎక్కువగా ఉన్న మొగ ఇప్పుడు తెరుచుకోవడానికి అక్రమ ఇసుక తవ్వకాలే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొంతమంది అధికార పార్టీ మద్దతుదారులు ఇక్కడ ఇసుక తవ్వకాలు చేయడం వల్ల మొగ తెరుచుకుందని రైతులు చెబుతున్నారు.

ఇటీవల మురుగునీటి కాలువలలో డ్రెడ్జింగ్ వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, దీని వల్ల లాభం కన్నా.. నష్టమే ఎక్కువని రైతులు మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోలేదు. పైగా వర్షాలు లేని సమయంలో వేసవిలో డ్రెడ్జింగ్ చేయడం వల్ల ఫలితం లేదని రైతులు చెబుతున్నారు. ఇక్కడ డ్రెడ్జింగ్ కోసం గత ఏడాది ఆగస్టులో డ్రెడ్జర్‌ను రప్పించారు. తవ్వకాలకు అనుమతి రాకపోవడంతో నెలల తరబడి ఇక్కడే ఉంచారు. అప్పట్లో తవ్వకాలు చేసినా గత ఏడాది ఖరీఫ్ పంట మునిగి పోకుండా ఉండేది. అప్పుడు చేయకపోవడం వల్ల వర్షాలకు చేలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. పైగా ముంపునీరు వీడకపోవడం వల్ల రబీ నారుమడులు వేసే అవకాశం లేకపోవడం.. సాగు ఆలస్యం కావడం.. ఆ ప్రభావం ఈ ఏడాది మే నెలలో కురిసిన వర్షాలకు పంట దెబ్బతిని దిగుబడి తగ్గడానికి కారణమైంది. ఇప్పుడు అవసరం లేని సమయంలో డ్రెడ్జింగ్ చేయడం వల్ల ఎగదన్నుకు వస్తున్న సముద్ర నీరు కూనవరం కాలువ ద్వారా వేగంగా ఇతర డ్రెయిన్లలోకి వెళ్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.

సీన్ రివర్స్

కూనవరం మొగ ద్వారా గత రెండు రోజులుగా సముద్ర నీరు మురుగునీటి కాలువ ద్వారా ఎగదన్నుతోంది. అధికారులు చేసిన డ్రెడ్జింగ్ లక్ష్యానికి ఇది పూర్తి విరుద్ధం. ప్రస్తుతం మురుగునీటి కాలువలోకి వస్తున్న నీటికి అడ్డుకట్ట వేయకుంటే ఇది పంట కాలువలు, పంట కాలువలకు అనుబంధంగా ఉండే ఛానళ్లు, పంట బోదెలలోకి కూడా వచ్చే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. ఇదే జరిగితే ఇక్కడ మొత్తం ఆయకట్టును సాగు చేయలేని పరిస్థితి నెలకొంటుంది. వేసవిలో అమలాపురం–చల్లపల్లి ప్రధాన పంట కాలువ ద్వారా చింతలపూడి లాకు (సమనస లాకు)ల వరకు ఉప్పునీరు వచ్చి చేరుతోంది. ఇప్పుడు కూడా ఇదే జరిగితే కూనవరం డ్రెయిన్ పరిధిలో మొత్తం సాగు లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది కాలువల మరమ్మతులు, వంతెనల నిర్మాణాల పేరుతో కాలువలకు గట్లు వేయడం వల్ల చేలకు ఇంకా సాగునీరు చేరలేదు. సాగు కాలం ఆలస్యమవుతున్నందున చాలా మంది రైతులు సాగు విరమణ ఆలోచనలలో ఉన్నారు. ఇప్పుడు మురుగునీరు దిగకపోవడానికి తోడు ఉప్పునీరు చొచ్చుకు వస్తుండడం చూసి సాగు చేసే ఆలోచనలో ఉన్న కొద్దిమంది రైతులూ భయపడుతున్నారు.



ఉప్పలగుప్తంలో ఏటా ఖరీఫ్‌ను వదులుకుంటున్న వరిచేలు

వరి, కొబ్బరి రైతులకు అపార నష్టం



ఇప్పటివరకు ముంపు సమస్యతో తొలకరి సాగు చేయడానికి మాత్రమే ఇబ్బంది పడే వాళ్లం. కూనవరం మేజర్ డ్రైన్ మొగను అధికారుల ప్రమేయం లేకుండా తెరవడంతో సముద్రం నుంచి ఉప్పునీరు డ్రైన్లలోకి చేరుతుంది. దీనితో కూనవరం మేజర్ డ్రెయినేజ్ గుండా నీరు ప్రవహించి పిల్ల కాలువలు పంట కాలువల్లో సైతం ఉప్పునీరు చేరి పంట పొలాల్లోకి ప్రవేశిస్తోంది. దీంతో దాళ్వా సాగుకు సైతం ఉపయోగపడకుండా భూములు ఉప్పుగా మారి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు దీనికి శాశ్వత పరిష్కారం చూపించి రైతుల సాగుకు సహకరించాలి.

– మంచం బాలకృష్ణ, రైతు గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

గడువు దాటితే ముప్పు

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



అంబాజీపేట: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో... సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాల పరిమితి ఉంటుందని, దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతీ సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్ విధానంలో మెటల్ ప్లేటుపై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకొని వినియోగించాలి.

ఇలా గుర్తించాలి..

సిలిండర్ మెటల్ ప్లేటుపై ఏ–25, బీ–25 అని ఉంటే ఆ సిలిండర్ 2025 మార్చి–జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 25 అంటే 2025 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. 'ఏ' అక్షరం జనవరి నుంచి మార్చి వరకు 'బి' అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, 'సీ' అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, 'డీ' అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది. సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేటుపై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దానిని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

సిలిండర్‌కు 10 ఏళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి 10 ఏళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు.

వినియోగదారుల హక్కులు..

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు.

సబ్ ప్లాన్ నిధులు ఏంచేస్తున్నారు

మాజీ మంత్రి సూర్యారావు

మలికిపురం: కూటమి ప్రభుత్వం దళితులను పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్‌ను శాలువాతో సన్మానించి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం నుంచి వచ్చే 30 శాతం సబ్‌ప్లాన్ నిధులను దళితుల ప్రాంతాల అభివృద్ధికి వినియోగించకుండా ఏం చేస్తున్నారని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. దళితుల ఓట్లు తమకు అక్కర్లేదన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. రూ.26 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. అంతే కాక దళితులు, దళిత నాయకులుతో పాటు రాష్ట్రంలో ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా పలు నేరాలకు పాల్పడిన వ్యక్తులకు కూటమి ప్రభుత్వం నజరానాలు ఇస్తోందని. విజయనగరంలో రాముని విగ్రహం తల విరగ్గొట్టిన వ్యక్తికి ప్రభుత్వం సాయం చేయడం ఇందుకు ఉదాహరణ అన్నారు. ఏడాది వ్యవధిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజలు విసుగుచెందారని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని గొల్లపల్లి పేర్కొన్నారు. పార్టీ నాయకులు పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, తాడి సహదేవ్, నేత నాని, గుర్రం వెంకట నాగరాజు, బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తెన్నేటి కిశోర్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధిగా 'తెన్నేటి'

రాజోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధిగా రాజోలుకు చెందిన తెన్నేటి కిశోర్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కిశోర్ నియామకం జరిగింది. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ఎంతో బలంగా ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జగన్ నాయకత్వంలో రాబోయే కాలంలో పార్టీకి మంచి రోజులు వస్తాయన్నారు. హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. తనను రాష్ట్ర ప్రచార విభాగ అధికార ప్రతినిధిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలను వేధిస్తే ఊరుకునేది లేదు

- కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి హెచ్చరిక
- నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభం

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, నాయకులను వేధిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, తాము తిరగబడితే తట్టుకోలేరని పీఏసీ సభ్యురాలు, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోతవరం గ్రామంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ నూతన కార్యాలయ ముఖ ద్వారాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కార్యాలయ గదిని విజయలక్ష్మి, సమావేశ మందిరాన్ని ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు బుధవారం ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్నవరపు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై నిత్యం వేధింపులు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. 300 యూనిట్ల విద్యుత్ పేరుతో తల్లికి వందనం పథకాన్ని ఎగ్గొట్టారని విజయలక్ష్మి, జగ్గిరెడ్డి అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు విజయలక్ష్మి. పాల్గొన్న ఎమ్మెల్సీలు త్రిమూర్తులు, ఇజ్రాయిల్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు

కార్యకర్తలకు అండగా ఉంటాం: తోట

ప్రజలకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కూటమి ప్రభుత్వ బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదన్నారు. రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళ్తామని అన్నారు. మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో విఫలమైందన్నారు. చంద్రబాబు నాయుడు ఏరు దాటాక తెప్ప తగలేసే రకమని అన్నారు. రాష్ట్ర ప్రజలకు జగన్‌పై అభిమానం తగ్గలేదన్నారు. నాయకులను జైలులో పెట్టగలరేమోగానీ ప్రజల గొంతు నొక్కలేరని అన్నారు. కోవిడ్‌లో రాష్ట్ర ప్రజలకు జగన్ అందించిన సేవలను దేశమంతా ప్రశంసించిందని తోట గుర్తు చేశారు. జగన్‌కు లభిస్తున్న ప్రజాభిమానికి భయపడిన కూటమి ప్రభుత్వం ఆయన పర్యటనలకు అడ్డంకులు కల్పిస్తోందని అన్నారు.

జగన్‌ను అధికారంలోకి తీసుకురావాలి: ఎమ్మెల్సీలు బొమ్మి, కుడుపూడి

వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనిని అక్రమంగా అరెస్టు చేస్తే.. కూటమి ప్రభుత్వానికి కోర్టులు అక్షింతలు వేశాయన్నారు.

దేశంలో కులగణన జరగాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. బీసీ కులగణనపై మండల స్థాయిలో వినతి పత్రాలు సమర్పించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని కుడుపూడి వైఎస్సార్ సీపీ శ్రేణులకు సూచించారు. పార్టీ కార్యాలయానికి షెడ్డు నిర్మించి ఇచ్చిన పార్టీ నాయకుడు యన్నాబత్తుల అనంద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ నాయకులు ఆయనను సత్కరించారు.

రామచంద్రపురం, అమలాపురం కోఆర్డినేటర్లు పిల్లి సూర్యప్రకాష్, పినిపే శ్రీకాంత్, పార్టీ సీనియర్ నాయకుడు పి.కె.రావు, మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర రావు, కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు కశిరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, గూడపాటి రమాదేవి, మట్టా శైలజ, రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీకాంత్, మందపాటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


23న ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే రన్‌ల బ్రోచర్లు, సర్టిఫికెట్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం టౌన్: జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ ఉదయం జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాల్లో ఒలింపిక్ డే రన్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ రన్ బ్రోచర్లు, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఈ రన్‌లలో వ్యాయామ ఉపాధ్యాయులు, స్పోర్ట్స్ క్లబ్‌ల ప్రతినిధులు, ఎంఎస్‌డీవోలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొంటారని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు తెలిపారు. పట్టణంలోని దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్ రిక్రియేషన్ క్లబ్ నుంచి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రన్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌బాబు పర్యవేక్షణలో సంఘం ప్రతినిధులు కల్వకొలను బాబు, తిక్కిరెడ్డి సురేష్‌ల సహకారంతో ఈ రన్ సాగనుంది.

కాసుల ఇంజినీరింగ్ మొదలు!



- బీటెక్ సీట్లకు బేరసారాలు
- కౌన్సెలింగ్‌కు ముందే భర్తీకి చర్యలు
- కంప్యూటర్ సైన్స్‌కు విపరీతమైన డిమాండ్
- కన్వీనర్ కోటా మేలంటున్న విద్యానిపుణులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ ప్రవేశాలకు త్వరలో షెడ్యూల్ విడుదల చేయనున్న నేపథ్యంలో ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అడ్మిషన్లకు సిద్ధమవుతున్నారు. ప్రైవేట్ కళాశాలలు సీట్లు భర్తీ చేసుకునే పనిలో బిజీగా ఉన్నాయి. సమయం దగ్గర పడటంతో కళాశాలల యాజమాన్యాలు మరింత స్పీడ్ పెంచాయి. తమ కళాశాలల్లో చేరండంటూ విద్యార్థులకు ఫోన్లు చేస్తున్నారు. కొంచెం పేరున్న కళాశాలల్లో చాలా వరకూ కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచ్‌లలో సీట్లు లేవని తెలుస్తోంది. సీట్లు పొందడానికి సిఫారసులు సైతం చేసుకునే పనిలో విద్యార్థులు ఉన్నారు. మొత్తం మీద ఇంజినీరింగ్ ప్రవేశాలకు అప్పుడే విద్యార్థులు ఎగబడుతున్నారు.

కన్వీనర్ కోటాకే ప్రభుత్వ సహాయం



కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయి. బీటెక్‌లో అన్ని బ్రాంచ్‌లు ముఖ్యమైనవే. విద్యార్థుల ఇష్టం మేరకూ కోర్సు ఎంచుకుని కన్వీనర్ కోటాలో చేరవచ్చు. జేఎన్‌టీయూకే పరిధిలో 160 కళాశాలల్లో దాదాపు 25 నుంచి 30వేల సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. ఎంసెట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలి.

– డాక్టర్ వీవీ సుబ్బారావు, ఏపీ ఎంసెట్ కన్వీనర్

ఉమ్మడి జిల్లాలో రెండు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో 950 సీట్లతో పాటు 26 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో దాదాపు 14,500 సీట్లు ఉన్నాయి. ఇటీవలే విడుదలైన ఎంసెట్–2025 ఫలితాల్లో కాకినాడ జిల్లాలో 6,343, కోనసీమ జిల్లాలో 2,866, తూర్పుగోదావరి జిల్లాలో 6,011 మంది ఉత్తీర్ణత సాధించారు. దీన్ని బట్టి కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ లభిస్తుంది.

సీట్లు దొరకవనే ప్రచారం

ఎంసెట్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుందామని వేచి చూస్తే కోరుకున్న కళాశాలలో సీటు దొరక్కపోవచ్చనే ప్రచారం అప్పుడే జరుగుతోంది. సీటు విషయమై ఒక అంచనాకు వస్తే బాగుంటుందని, ముందస్తుగా కొంత అడ్వాన్స్ ముట్టజెప్పాలని ఆయా కళాశాలలు కోరుతున్నాయి. మంచి కళాశాలలో సీట్లు దొరకవనే ప్రచారంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ర్యాంకులతో సంబంధం లేకుండా సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్, ఎన్నారై ఇలా పలు విధాలుగా సీట్లు భర్తీ చేసుకుంటున్నారు. ఐదేళ్లుగా అంతర్జాతీయంగా ఐటీకి డిమాండ్ రావడం, సాఫ్ట్‌వేర్ కంపెనీలు భారీగా కొలువులను ఆఫర్ చేస్తుండడంతో చాలా వరకూ సీఎస్‌ఈ, దానికి అనుబంధంగా ఉండే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర బ్రాంచ్‌లకు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ జిల్లాలో బాగా పేరొందిన ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ సీటుకు డొనేషన్ రూ.10 లక్షల వరకూ ఇవ్వడానికి వెనకాడటం లేదంటే ఎంత డిమాండ్ ఉందో అర్థమౌతుంది. ఓ మోస్తరు కళాశాల అయితే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఇస్తామని, సీటు రిజర్వ్ చేయాలని కోరుతున్నారు. కౌన్సెలింగ్ ప్రారంభమై కోరుకున్న కళాశాలలో సీటు రాకపోతే.. అప్పుడు బాధపడినా ప్రయోజనం ఉండదని, ముందుగా యాజమాన్యాలతో మాట్లాడి ర్యాంకు వస్తే ఆ కోటాలో సీటు ఖరారు చేసుకోవచ్చని, లేకపోతే దాన్ని మేనేజ్‌మెంట్ కోటా లేదా ఎన్నారై కోటాకు మార్చుకోవడానికి అవకాశం కల్పిస్తామని చెప్పి యాజమాన్యాలు ప్రస్తుతం సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి.

క్లుప్తంగా

సీతపల్లి వాగులో ఇద్దరు యువకుల మృతి

కోటికేశవరంలో విషాదం



పీతల రాకేష్, గుమ్మడి హర్ష మృతదేహాలు



పీతల రాకేష్ (ఫైల్)



గుమ్మడి హర్ష (ఫైల్)

కోరుకొండ: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం, సీతపల్లివాగులో స్నానానికి దిగి కోరుకొండ మండలం కోటికేశవరానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే ఇటీవల వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్టు సభ్యులు 15 మంది బుధవారం వాగులోకి స్నానాలకు దిగారు. వారిలో పీతల రాకేష్ (25), గుమ్మడి హర్ష (25) వాగు ప్రవాహ వేగానికి కాలు జారి కొట్టుకుపోయారు. ఈ క్రమంలో వాగులోని రాళ్లకు వారు బలంగా ఢీకొని మృతి చెందారు. వీరిలో రాకేష్ చిన్న కిల్లీ దుకాణం నిర్వహిస్తున్నాడు. వాలీబాల్ క్రీడాకారుడైన అతడు మైదానంలో కట్ కొడితే ప్రత్యర్థి జట్టు సభ్యులు అడ్డుకోలేరని మంచి పేరుంది. కాగా గుమ్మడి హర్ష తల్లి కవిత సహకారంతో చిరు వ్యాపారం చేస్తున్నాడు. గ్రామ సర్పంచ్ ముడే సింధూ దివ్య, ఆమె భర్త ముడే కామేష్ ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాలకు పంచనామా తదితర కార్యకలాపాలు నిర్వహించారు.

ఇసుక తవ్వుతున్న ఏడు పడవల సీజ్

తనిఖీల్లో జిల్లా మైనింగ్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి



తాళ్లపూడిలో అధికారులు సీజ్ చేసిన పడవలు

తాళ్లపూడి: స్థానిక డీసిల్టేషన్ పాయింట్ వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న ఏడు పడవలను అధికారులు బుధవారం సీజ్ చేశారు. జిల్లా మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, టాస్కఫోర్స్ ఎస్సై ఆంజనేయులు తదితరులు సాధారణ తనిఖీల్లో భాగంగా బోట్స్‌మన్ సొసైటీ సభ్యులు గోదావరిలో ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న ఏడు పడవలను సీజ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలపై నిషేధం ఉందని వారు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీలు చేసినట్టు ఆయన తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ పడవలను సీజ్ చేశామని తెలిపారు. కాగా ఇసుక తవ్వకాలు చేపట్టిన పడవలు ఎవరివన్న విషయమై సాయంత్రం వరకు అధికారులు తర్జనభర్జన పడ్డారు.

పైసలిస్తేనే పోస్టింగ్!

- వైద్య, ఆరోగ్య శాఖలో పదోన్నతుల కౌన్సెలింగ్
- పోస్టుకో రేటు నిర్ణయం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పలువురు ఏఎన్ఎంలు
- ఆయన ఆదేశాలతో రీ కౌన్సెలింగ్
- సొమ్ము తిరిగి ఇవ్వాలని మెక్కిన వారిపై ఒత్తిడి



కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద రీ కౌన్సెలింగ్ కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైద్య, ఆరోగ్యశాఖ పదోన్నతుల కౌన్సెలింగ్‌లో అవినీతి జాతర సాగుతోంది. కొందరి అవినీతి పరాకాష్ఠకు చేరుకుంది. కాసులిస్తేనే పదోన్నతులు, కోరుకున్న కుర్చీలు దక్కుతున్నాయి. ఒక్కో పోస్టుకు ఒక్కొక్క రేటు నిర్ణయించి ముక్కుపిండి మరీ వసూళ్లకు పాల్పడ్డారు. పదోన్నతుల బాగోతంలో లక్షలు చేతులు మారాయి. సాధారణంగా పదోన్నతులు వచ్చినప్పుడు ఏ స్థాయిలో ఉన్నా ఉద్యోగులు తలా ఇంత సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదే. ఇటువంటివన్నీ ఉద్యోగులు సంతృప్తి కోసం సంతోషంగా ఇస్తుంటారు. ఏ శాఖలో అయినా ఇదేమీ కొత్త కూడా కాదు. ఎటొచ్చీ పదోన్నతులకు ఒక రేటు, కోరుకున్న సీటు కోసం మరొక రేటు నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడటమే ఈ సారి సంబంధిత శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖ పదోన్నతులు కాకినాడ డీఎంహెచ్ఓ నోడల్ అధికారి వ్యవహరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు ఏఎన్ఎంలుగా పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 830 సబ్ సెంటర్లలో సుమారు 400 సబ్ సెంటర్లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందుకోసం గత ఆదివారం ఉదయం నుంచి తెల్లవారుజాము వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో భార్య, భర్తలు, వితంతువులు, పెళ్లికాని వారు, అనారోగ్య సమస్యలున్న వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 60 మందికి పోస్టింగులు ఇచ్చారు.

340 సబ్ సెంటర్లలో ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు సాధారణ కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే హెల్త్ సెక్రటరీలు ఏఎన్ఎంలుగా పదోన్నతి కోసం క్యూ కట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా జరిపిన కౌన్సెలింగ్‌కు ముందుగానే ఆ శాఖలోని కొందరు చేతివాటం చూపించారు. ఇందుకోసం ఒక రేటు కూడా నిర్ణయించి వసూళ్ల పర్వానికి తెరతీశారు. పదోన్నతి పొందిన వారికి సీటు కేటాయించే సందర్భంలో సొమ్ములు గుంజారు. రూ.4000 నుంచి రూ.5000 వంతున వసూలు చేశారు. ఇలా రూ.20 లక్షలు వరకు ముడుపులు వసూలుచేశారు. ఇందులో వైద్య ఆరోగ్యాన్ని పర్యవేక్షించే ఒకరికి 50 శాతం, పరిపాలనా వ్యవహారాలు చక్కబెట్టే దిగువ స్థాయి వారు 20 శాతం, క్షేత్ర స్థాయిలో వ్యవహారాలు చక్కబెట్టే వారికి 30 శాతం వంతున వాటాలు వేసుకున్నారు. కృష్ణా జిల్లా నుంచి వచ్చి కాకినాడలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఒక ఉద్యోగి, ఎపిడమిక్ విభాగంలో మరొకరు, ఏఎన్ఎం సంఘంలో ముగ్గురు కలిసి ఈ మొత్తం అవినీతి బాగోతాన్ని గుట్టుచప్పుడు కాకుండా చక్కబెట్టి సొమ్ము చేసుకున్నారు.



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహం నాయక్

పదోన్నతులతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను బ్లాక్‌లో పెట్టి సొమ్ములు ఇచ్చిన వారికి కోరుకున్న పోస్టింగ్‌లు కట్టబెట్టేశారు. ఇలా పోస్టింగ్‌లు అందుకున్న వారి నుంచి రూ.30 వేలు వంతున వసూలు చేసి మూటగట్టేసుకున్నారు. ఇలా మరో తొమ్మిది లక్షలు ముడుపులు మెక్కి పోస్టింగ్‌లు ఇచ్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇలా సొమ్ములు తీసుకున్న వ్యవహారంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యుల వ్యహారాలు పర్యవేక్షించే ఒకరు, పరిపాలనా విభాగంలో మరొకరు సూత్రధారులుగా వ్యవహరించారు. ఈ లంచావతారాలతో విసుగెత్తిపోయిన ఐదుగురు ఏఎన్ఎంలు వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి చేసిన ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చి కథ అడ్డం తిరిగింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ రీ కౌన్సెలింగ్ జరపాలని ఆదేశాలు చేశారు. దీంతో బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. వేలకు వేలు సొమ్ములు ముట్టచెప్పి పోస్టింగులు పొందిన వారి పరిస్థితి రీ కౌన్సెలింగ్‌తో కుడితిలో పడ్డ ఎలుక చందంగా తయారైంది. సొమ్ములు ఇచ్చి కోరుకున్న పోస్టింగులు పొందిన వారి స్థానాలు తాజా కౌన్సెలింగ్‌లో మారిపోతున్నాయి. దీంతో గత ఆదివారం ఇచ్చిన సొమ్ములు తిరిగి ఇచ్చేయాలని సదరు సూత్రధారులపై ఉద్యోగులు ఒత్తిడి తెస్తున్నారని సంబంధిత వర్గాల ద్వారా తెలియవచ్చింది. సొమ్ములు తిరిగి ఎలా ఇవ్వగలుగుతామని, ఏదో రకంగా సర్దుబాటు చేస్తామని బుజ్జగిస్తున్నారు. రీ కౌన్సెలింగ్ పూర్తయ్యి చివరకు ఈ వ్యవహారం ఏ మలుపు తీసుకోనుందో వేచి చూడాల్సిందే.

రీ వెరిఫికేషన్ పూర్తి

కాకినాడ క్రైం: సచివాలయం ఏఎన్ఎంల నుంచి ఎంపీహెచ్ఏఎఫ్‌లుగా పదోన్నతులు పొందిన అభ్యర్థుల కౌన్సిలింగ్ రీవెరిఫికేషన్ బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి తూర్పు గోదావరికి చెందిన 390 మందికి కాకినాడ డీఎంహెచ్ఓ కార్యాలయంలో డిఎంహెచ్ఓ డాక్టర్ నరసింహంనాయక్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. తాజా ప్రక్రియలో ఇద్దరు అనర్హులను, గత ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో బృందాన్ని మోసగించి పదోన్నతులు పొందిన ఇద్దరు సచివాలయ ఏఎన్ఎంలను గుర్తించారు. ఓ ఏఎన్ఎం వివాహితురాలు అయినప్పటికీ అవివాహిత హోదాలో బదిలీ ప్రయోజనం పొందింది. మరో ఏఎన్ఎం ప్రొహిబిషన్ డిక్లేర్ కాకపోయినా బదిలీలకు హాజరై తనకు అనుకూలమైన స్థానాన్ని పొందింది. వీరద్దరిని డీఎంహెచ్ఓ బుధవారం నాటి రీవెరిఫికేషన్‌లో గుర్తించారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా 388 మందికి నియామక పత్రాలు అందజేశారు.

యోగాంధ్రలో 'నన్నయ'కు రికార్డు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాన్ని వీసీకి అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గోదావరి జిల్లాల నుంచి 16,123 మంది హాజరు

రాజానగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపు మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'మెగా యోగ' కార్యక్రమానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. తెలుగు రాష్ట్రాలలో అతి పెద్ద యూనివర్సిటీ ఉన్న 'నన్నయ'లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అదే స్థాయిలో 16,123 మంది హాజరు కావడంతో, దీనిని ఒక రికార్డుగా గుర్తించిన ఆ సంస్థ నిర్వాహకులు డాక్టర్ సి.కె. రాయుడు, తాతా వెంకట వరప్రసాద్‌లు అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీకి అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు, క్యాంపస్‌ల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది అంచనాలకు మించి ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కడంతో పాటు యూనివర్సిటీ చరిత్రలో ఒక చారిత్రిక ఘట్టంగా నిలిచిపోతుందన్నారు. ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం యోగ సాధన చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు మేధో సంపత్తిని వృద్ధి చేసుకునేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఇది ఎంతో అవసరమన్నారు.

యోగాసనాలతో అబ్బురపరిచారు

యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కార్పెట్లపై విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వేసిన యోగాసనాలు అబ్బురపరిచాయి. కానవరంలోని రాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ప్రతినిధుల పర్యవేక్షణలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 - 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 - 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 - 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 - 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

మరిడమ్మ జాతరకు పటిష్ట భద్రత

కాకినాడ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీహరిరాజు



కరప శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న డీఎస్పీ శ్రీహరిరాజు

కరప: ఈనెల 25వ తేదీ నుంచి 40 రోజుల పాటు జరిగే మరిడమ్మ జాతర మహోత్సవంలో భక్తులకు అసౌక్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు పెద్దాపురం డీఎస్పీ, కాకినాడ ఇన్‌ఛార్జ్ డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపారు. బాలిక అదృశ్యంపై దర్యాప్తునకు కరప ఎస్ఐ టి.సునీతతో చర్చించేందుకు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దాపురంలో అమ్మవారి దర్శనానికి ఆది, మంగళ, గురువారాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో క్యూలైన్లు, వివిధ శాఖల సమన్వయంపై ఆదేశాలిచ్చినట్టు తెలిపారు.

బాలిక అదృశ్యంపై దర్యాప్తు

బాలిక అదృశ్యం కేసుపై ఎస్ఐతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు, బంధువులు డీఎస్పీని కలసి తమ గోడు వినిపించారు. బాలికను కిడ్నాప్ చేసినట్టు భావిస్తున్న యువకుడి తండ్రిని పిలిపించి మాట్లాడారు. కిడ్నాప్ కేసుతో పాటు, పోక్సో కేసు పెట్టాల్సి ఉంటుందని, ఎక్కడున్నా వెంటనే సమాచారం చెప్పాలని యువకుడి తండ్రికి డీఎస్పీ సూచించారు. ఆర్డీఓ, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు వేస్తామని ఆయన హెచ్చరించారు. బాలిక అదృశ్యానికి సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని, బాలిక వివరాల ముఖ్యమైన నగరాల్లోని పోలీసులకు పంపినట్టు ఆయన తెలిపారు. అనంతరం కరపలోని పురాతన శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లి స్వామివార్లను ఆయన దర్శించుకున్నారు. అర్చకులు విలపర్తి శ్రీనివాస్, విలపర్తి సత్యకృష్ణ, పెద్దింటి గోపాలకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ఆశీర్వచనం ఇచ్చారు.

వేతనాల ఆలస్యం రివాజే!

- రత్నగిరిపై కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల కష్టాలు
- వరుసగా మూడో నెలా ఆలస్యం
- నగం నెల దాటినా సిద్ధం కాని బిల్లు



అన్నవరం దేవస్థానం ఆవరణ



మే 26న సాక్షిలో ప్రచురితమైన కథనం

అన్నవరం: రత్నగిరిపై పారిశుధ్య కార్మికుల వేతన కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. 18వ తేదీ వచ్చినా ఈ నెల జీతాల బిల్లు సిద్ధం చేసిన దాఖలాలు లేకపోవడంతో దేవస్థానంలోని 349 మంది కార్మికులు మూడో నెలలో కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. బిల్లు తయారై ఆడిట్‌కు వెళ్లి పాసై వస్తే అప్పుడు చెక్కుపై ఈఓ సంతకం చేయడం, దానిని ఆన్‌లైన్‌లో కాంట్రాక్టర్‌కు బదలాయించడం, ఆయన సదరు కార్మికుల అకౌంట్లలో జమచేయడం ఈ ప్రక్రియంతా కనీసం వారం రోజుల ప్రహసనం. అంటే 25వ తేదీ దాటితే తప్ప కార్మికులకు మే నెల జీతాలు పడని పరిస్థితి.

గత రెండు నెలలూ ఆలస్యమే..

ఆలయంలో కార్మికులకు వేతనాలు ఆలస్యంగా చెల్లించడం రివాజైపోయింది. మార్చి నెల జీతాలు ఏప్రిల్ 30న, ఏప్రిల్ నెల జీతాలు మే 28న చెల్లించారు. ఏప్రిల్ 25న 'మాకు జీతాలు ఎప్పుడిస్తారు స్వామీ...? అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనానికి, మే 26న ప్రచురితమైన 'వీరి కష్టం తుడిచేవారేరీ' కథనాలకు స్పందించి అధికారులు ఆ తేదీలకైనా వారి అకౌంట్లలో జమ చేయగలిగారు. ఇందులో కూడా ఏప్రిల్ నెలకు సంబంధించి రూ.లక్ష కోత పెట్టి రూ.58 లక్షలు విడుదల చేశారు. అయితే మొత్తం నిధులు వస్తేకానీ చెల్లించనని కాంట్రాక్టర్ చెప్పడంతో జూన్ ఒకటో తేదీకి కానీ జమ చేయలేదు.

కాంట్రాక్టర్ వల్లే ఆలస్యం

దేవస్థానానికి పారిశుధ్య సిబ్బందిని సరఫరా చేస్తున్న గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీ సకాలంలో పీఎఫ్ జమ చేయకపోవడం, బిల్లు అందచేయకపోవడం వల్లే జీతాల చెల్లింపు ఆలస్యమవుతోందని అధికారులు పదే పదే చెప్తున్నారు.

ఏజెన్సీకి స్తోమత లేకపోయినా..

హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ రెండేళ్లకు పైగా దేవస్థానంలో పారిశుధ్య విధులు నిర్వహించింది. ఆ సంస్థ ప్రతి నెల పదో తేదీనే సిబ్బందికి జీతాలు చెల్లించేది. గత నవంబర్‌తో ఆ సంస్థ గడువు ముగిసినా టెండర్ ద్వారా కొత్త సంస్థను కాంట్రాక్టుకు ఎంపిక చేసే వరకు విధులు కొనసాగించాలని అధికారులు కోరడంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు కాంట్రాక్టు కొనసాగింది. మార్చి ఒకటో తేదీ నుంచి ఆ కాంట్రాక్టు గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీకి అప్పగించారు. ఆ సంస్థకు 349 మందికి జీతాలు ఇచ్చే స్తోమత లేకపోయినా అధికారులు నామినేషన్ పద్ధతిపై ఇచ్చినట్టుగా హడావిడిగా విధులు కట్టబెట్టారు. దీంతో ఆ సంస్థపై ఏ విధమైన చర్యలూ తీసుకోలేని పరిస్థితిని అధికారులే కల్పించుకున్నారు. కానీ సకాలంలో జీతాలు అందక పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కత్తులతో బెదిరించి దోపిడీ

- నేమాం బీచ్‌రోడ్డులో ఈ నెల 8న ఘటన
- రెండు రోజుల తరువాత కేసు నమోదు
- ముగ్గురి అరెస్టు, మరొకరు పరారీ



అరెస్టు చేసిన నిందితులతో తిమ్మాపురం పోలీసులు

కాకినాడ రూరల్: కాకినాడ నగరంతో పాటు పరిసర గ్రామాలలో నిర్జన ప్రదేశాలలో రాత్రి పూట మోటారు సైకిళ్లపై వెళ్లే వారిని అడ్డగించి కత్తులతో బెదిరించి దారి దోపిడీకి పాల్పడుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువగానే చోటు చేసుకుంటున్నాయి. తాజాగా కాకినాడ - ఉప్పాడ బీచ్ రోడ్డులో కాకినాడ రూరల్ నేమాం ఎస్ఆర్ఎంటీ చౌదరి మెమోరియల్ వద్ద చోటుచేసుకున్న దోపిడీపై తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే ఈనెల 8న ఒక యువతీ, యువకుడు బీచ్ సందర్శనకు వచ్చారు. రాత్రి 10.20 గంటల సమయంలో వారి వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి కత్తులతో బెదిరించి బంగారు ఉంగరం, మొబైల్ ఫోన్‌ను లాక్కున్నారు. తరువాత ఆ మొబైల్‌ను మరో వ్యక్తికి అందించారు. అమ్మాయి సెల్ ఫోన్ ద్వారా సదరు నాలుగో వ్యక్తి బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ ఘటనపై యువకుడు తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 11వ తేదీన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. సర్పవరం గ్రామానికి చెందిన నిందితుల్లో ఏ1 పిల్లి చలం పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురు ముల్కి మారుతి శ్రీ సాయిరామ్, కుండల హేమంత కుమార్, దారా నానిలను బుధవారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. వారిని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స కోసం స్థానిక ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. తమిళనాడు నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు వెళ్తున్న కారు దుద్దుకూరు వద్ద అదుపు తప్పి డ్రైనేజీలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తుల్లో జావీద్, ఆయాష్ గాయపడగా స్థానికులు హైవే అంబులెన్స్‌లో వారిని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.



డ్రైనేజీలోకి కారు దూసుకుపోవడంతో గాయపడిన జావీద్

సెంట్రల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీల విడుదల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి బుధవారం ఇద్దరు ఖైదీలు విడుదలయ్యారు. ఆ వివరాలను సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది ఖైదీలు విడుదల కాగా వారిలో రాజమహేంద్రవరం సెంట్రల్ నుంచి ఇద్దరికి అవకాశం వచ్చింది. వారిలో కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన కోనేటి సత్తిబాబు, గజ్జవరపు మురళీకృష్ణ ఉన్నారు. వీరు హత్య కేసులో జైలుకి వచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 17 నాటికి అర్హత కలిగిన జీవిత ఖైదీల విడుదలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఇద్దరు ఖైదీలకు ప్రత్యేక ఉపశమనం ఇచ్చి విడుదల చేశారు.

బాధితురాలికి న్యాయం చేస్తాం

రాజమహేంద్రవరం రూరల్: పెళ్లి చేసుకుంటాడని నమ్మి మోసపోయిన బాధితురాలికి అన్ని విధాలా న్యాయం చేస్తామని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శశాంక ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక మహిళ తన కుమార్తెను పులవర్తి సత్యదేవ్ తన కుమార్తెను ప్రేమించి మోసం చేశాడని ఓ మహిళ కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళాభివృద్ధి, సంక్షేమశాఖ, వన్‌స్టాప్ సెంటర్ విచారణ జరిపింది. బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చామని, తమకు పదిరోజులు గడువు కావాలని కోరగా, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ వారం రోజులు గడువు ఇచ్చారని పేర్కొన్నారు. బాధితురాలిని సత్యదేవ్ వివాహం చేసుకోవడానికి నిరాకరించడంతో ఈనెల 13న అతనిపై పోక్సో కేసు నమోదు చేశారని, ప్రస్తుతం అతడు రిమాండ్‌పై సెంట్రల్ జైల్‌లో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారన్నారు. ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఉంచారన్నారు.